క్లుప్తంగా

నేడు, రేపు మహిళా ఖోఖో జట్టు ఎంపిక

తుని రూరల్: మండలంలోని వి.కొత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 8, 9 తేదీల్లో మహిళా ఖోఖో జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ లలిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటారన్నారు.

రైతులకు నష్ట పరిహారం అందించాలని వినతి

ప్రత్తిపాడు: తుపాన్ వల్ల నష్టపోయిన రైతాంగానికి తక్షణమే నష్టపరిహారం అందించాలని పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను కోరారు. ఈ మేరకు గురువారం ప్రత్తిపాడు డిప్యూటీ తహసీల్దార్ కె.పుణ్యవతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను కారణంగా నియోజకవర్గంలోని వరి, అరటి, మామిడి, జీడిమామిడి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొప్పన వెంకటేశ్వరరావు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మొయ్యేటి సూర్యప్రకాశరావు, దాసరి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ధాన్యం సేకరణ

గండేపల్లి: తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు తడిసిన ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. మండలంలో తడిచిన, రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైసు మిల్లులకు తరలిస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి సద్గురుమూర్తి తెలిపారు. మండల వ్యాప్తంగా గురువారం 10.7 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చసిన రైస్ మిల్లులకు తరలించినట్టు వివరించారు. కష్ట సమయంలో ప్రభుత్వం తమకు అండగా నిలవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బాధితురాలికి చేయూత



బాధితురాలికి ఆర్థిక సాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గోకవరం: తుపాను ప్రభావంతో ఇల్లు దెబ్బతిన్న బాధితురాలికి ప్రభుత్వం అండగా నిలిచింది. వివరాల్లోకి వెళితే.. స్థానిక మురళీనగర్ ఊరకాలువ సమీపంలోని పెరుమళ్ల సోమాలమ్మ అనే మహిళ ఇల్లు వర్షాలకు దెబ్బతింది. ఆమెను స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించి ప్రభుత్వపరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. దీనిలో భాగంగా గురువారం ప్రభుత్వసాయంగా రూ.10 వేలు నగదు అందజేశారు. అలాగే బాధితురాలికి గోకవరం సొసైటీ అధ్యక్షుడు గాజింగం సత్తిబాబు బియ్యం, కూరగాయలు, నగదు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వీరబాబు, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కర్రి సూరారెడ్డి, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, వీఆర్వో శశికళ, తదితరులు పాల్గొన్నారు.

68 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం

తొండంగి: తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు మండలంలోని 68 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్టు హార్టీకల్చర్ అధికారి విజయలక్ష్మి తెలిపారు. మండలంలోని కృష్ణాపురం, పైడికొండ గ్రామాల్లో గురువారం ఆమె పర్యటించారు. మిరప, అరటి, ఇతర కూరగాయాల పంటలను పరిశీలించి సస్య రక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 68 హెక్టార్లలో కూరగాయల పంటలు దెబ్బతినగా 10 కొబ్బరి చెట్లు, 4.6 హెక్టార్లలో అరటి పంటలు దెబ్బతిన్నాయన్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. ఆమె వెంట గ్రామ సచివాలయ హార్టీకల్చర్ అసిస్టెంట్ తాతాజీ రైతులు ఉన్నారు.

ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు

జగ్గంపేట: తుపాన్లు, భారీ వర్షాలు వస్తే స్థానిక పేకేటి వీరమ్మ చెరువు కాలువ పొంగి పల్లపు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయని, ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం తెలిపారు. పేకేటి వీరమ్మ చెరువు కాలువను గురువారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. తుపాను ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షానికి పలు ఇళ్లలోకి నీరు చేరిందన్నారు. సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లడంతో జిల్లా పంచాయతీ అధికారి కాలువను పరిశీలించారన్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, పంచాయతీ అధికారులతో కలిసి వెళ్లి ముంపు నివారణ చర్యలకు ప్రాథమిక అంచనాలు రూపొందించామని తెలిపారు. ఈ నివేదికను జెడ్పీటీసీ సభ్యురాలు బింధుమాధవి ద్వారా జిల్లా కలెక్టర్‌కు అందచేసి నిధులు మంజూరుకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌బ్ల్యూఎస్ జెఈ రాంజీ, ఈఓపీఆర్డీ కొండలరావు, ఈఓ గణేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో నీట మునిగిన పంట పొలాలను పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



బొద్దవరంలో పనలపై తడిసిన పంటను పరిశీలిస్తున్న అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు



రౌతులపూడిలో నేలనంటిన వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు



ఎ.కొత్తపల్లిలో పనలపై దెబ్బతిన్న పంటను ప్రత్యేకాధికారి ప్రమీలకు చూపిస్తున్న రైతు

అంచనా వేసి.. అండగా నిలిచి..

- క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టం అంచనా వేస్తున్న అధికారులు
- రైతులను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని భరోసా



జిల్లేడుపాడు గ్రామస్తులతో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్, ఎంపీపీ, నాయకులు

ప్రత్తిపాడు/ప్రత్తిపాడురూరల్: మిచాంగ్ తుపాన్ కారణంగా వాటిల్లిన పంట నష్టాన్ని అంచనా వేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. గత నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు మండలంలోని పలు ప్రాంతాల్లో వరి పంట నీట మునిగింది. గురువారం వాతావరణం తెరిపిచ్చి ఎండ కాయడంతో రైతులు పంటలను ఒబ్బిడి చేసుకుంటున్నారు. కాగా ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు మండలంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ, ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు, వ్యవసాయశాఖ జగ్గంపేట ఇన్‌చార్జి అసిస్టెంట్ డైరెక్టర్ యింటి వీర గంగాధర్ తమ సిబ్బందితో గ్రామాల్లో పర్యటించి నీట మునిగిన వరి పంటను పరిశీలించారు. రైతులతో మాట్లాడి ఆందోళన చెందవద్దని వారికి భరోసా కల్పించారు. మండలంలో 1,440 ఎకరాలల్లోని వరి పంట నేలను అంటగా మరో 600 ఎకరాలలో పంట నీట మునిగిందని తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ తెలిపారు. మండలంలోని పెద్దిపాలెం, గోకవరం, బవురువాక, బురదకోట గ్రామాల్లోని 130 ఎకరాల్లోని అరటి తోటలు ధ్వంసమయ్యాయన్నారు. శరభవరంలో సుమారు 30 ఎకరాల్లోని మామిడి పంటకు నష్టం వాటిల్లిందని తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ తెలిపారు.

ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలి

పల్లపు, మెరక భూముల్లో నీరు పోయే మార్గం చేసుకోవాలని వ్యవసాయశాఖ జగ్గంపేట అసిస్టెంట్ డైరెక్టర్ యింటి వీర గంగాధర్ తెలిపారు. వరి పంట పనల మీద, కుప్పల మీద, తడిసిన ధాన్యానికి ఎకరానికి 5 కేజీల వంతున ఉప్పు ద్రావణం పిచికారీ చేయడం వల్ల మొలక రావడం, రంగు మారడాన్ని నివారించవచ్చన్నారు. కళ్లాల్లో ధాన్యం ఉంటే తేమతో సంబంధం లేకుండా రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామన్నారు. రైతులు ఆర్‌బీకేల సహాయకులను సంప్రదించాలని ఏడీఏ యింటి వీర గంగాధర్ సూచించారు.

కోటనందూరు: మండలంలోని ముంపు ప్రభావిత ప్రాంతాల్లో గురువారం వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు పర్యటించారు. మండలంలోని అల్లిపూడి, బొద్దవరం, ఇందుగపల్లి, కొత్తకొట్టాం, కోటనందూరు, జగన్నాథపురం తదితర గ్రామాల్లో ఏఏబీ జిల్లా చైర్మన్ లంక ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు చింతకాయల చినబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, ఎంపీడీఓ శర్మ తహసీల్దార్ కుశరాజు, ఏఓ చంద్రశేఖర్ పర్యటించారు. ముంపునకు గురైన, నేలకొరిగిన, పనలపై తడిచిన వరి పంటను పరిశీలించారు. ఎంత మేర నష్టం జరిగిందని రైతులను అడిగి తెలుసుకున్నారు. పంట నష్టాన్ని మంత్రి దాడిశెట్టి రాజా, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

తుని రూరల్: పంపా, పుష్కర జలాలతో ముంపునకు గురైన జిల్లేడుపాడు గ్రామస్తులను మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, తుని ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు పోతుల లక్ష్మణ్ పరామర్శించారు. గురువారం గ్రామంలో పర్యటించి అధికారులు అందిస్తున్న సహాయక చర్యలను పరిశీలించారు. బాధితులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందన్నారు. రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా ముంపు సమస్యను సీఎం వైఎస్‌జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తారని ఏఎంసీ చైర్మన్ బాబు తెలిపారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటారన్నారు. తడిసిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ మండల మాజీ అధ్యక్షుడు పోతల రమణ, గ్రామ సర్పంచ్ రాయి మేరీఅవినాష్, కీర్తి బాలకృష్ణ పాల్గొన్నారు.

రౌతులపూడి: తుపాన్ ప్రభావంతో నీటమునిగిన వరి పంటల సంరక్షణకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి రెడ్డి ఈశ్వరరావు సూచించారు. రౌతులపూడిలో దెబ్బతిన్న పంటలను మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబుతో కలసి గురువారం ఆయన పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. పొలాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. తడిసిన వరి పనలపై ఉప్పు నీటి ద్రావణం పిచికారీ చేయాలని సూచించారు.

తొండంగి: తుపాను ప్రభావంతో మండలంలోని దెబ్బతిన్న పంటలను గురువారం అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎ.కొత్తపల్లిలో పనలపై ఉన్న వరి పంటను మండల ప్రత్యేకాధికారి ప్రమీలా, ఏఓ ఎస్.నరసింహం పరిశీలించారు. మండల వ్యాప్తంగా 6370 ఎకరాల్లో పంట దెబ్బతిన్నట్టు అంచనా వేశారు.

పరిశీలించిన ఆర్డీఓ సీతారామారావు

పంపా రిజర్వాయర్‌లో మిగులు జలాలను అధికారులు సముద్రంలోకి విడుదల చేయడంతో మండలంలోని పి.అగ్రహారం, గోపాలపట్నం, కృష్ణాపురం, పైడికొండ, వేమవరం గ్రామాల్లో పంట పొలాలను వరదనీరు ముంచెత్తింది. కాగా పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు, తహసీల్దార్ జి.సుబ్రహ్మణ్యం రెవెన్యూ అధికారులతో కలిసి పొలాలను పరిశీలించారు. ఏటా పంపా రిజర్వాయర్ జలాల కారణంగా తమ పొలాలు ముంపు బారిన పడుతున్నాయని బాధిత రైతులు వాపోయారు. దీనిపై సమగ్ర నివేదికను రూపొందించి ప్రభుత్వానికి పంపుతామని ఆర్డీఓ తెలిపారు.

నష్టాన్ని అంచనా వేసేందుకు చర్యలు

కిర్లంపూడి: తుపాను ప్రభావంతో మండలంలో జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు చర్యలు చేపట్టామని జిల్లా పంచాయతీ అధికారి, మండల ప్రత్యేక అధికారిణి కె.భారతి సౌజన్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వివిధ శాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి నష్టాన్ని అంచనా వేయాలన్నారు. అనంతరం ఏఓ జోశా అమృతతో కలిసి జగపతినగరంలో నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు. మండలంలో సుమారు 17 వందల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు.

రాష్ట్రాభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యం



పైడికొండలో పార్టీ జెండాను ఆవిష్కస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తొండంగి: రాష్ట్రాభివృద్ధి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైస్ ఎంపీపీ నాగం గంగబాబు అన్నారు. మండలంలోని పైడికొండలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలను తెలిపే డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. ప్రధాన రహదారిలో పార్టీ జెండాను ఎగురు వేశారు. అనంతరం పార్టీ నాయకులు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరించారు. ప్రస్తుతం అందుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గాబు రాజు, పార్టీ నాయకులు కొయ్య మురళి, దడాల విజయ్, అంగుళూరి సుశీలరాణి, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ దూళిపూడి అంజి, మండల సమన్వయ కమిటీ సభ్యుడు బెక్కం చంద్రగిరి, సర్పంచ్ నర్సే వీరస్వామి, ఉపసర్పంచ్ త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

రక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు



బొద్దవరంలో మంచినీటి ట్యాంకు క్లీనింగ్ పనులను పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్

కోటనందూరు: గ్రామాల్లో రక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టామని పంచాయతీ విస్తరణాధికారి జి.అరుణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని బొద్దవరం, టీజే నగరం, ఇందుగపల్లి గ్రామాల్లో మంచి నీటి ట్యాంకుల క్లీనింగ్ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ట్యాంకులను రెండు రోజులకొకసారి శుభ్రపరిచి నీటిని విడుదల చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నామన్నారు. గ్రామాల్లో మంచినీటి సరఫరా, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.

ముంపులోనే పంట పొలాలు



లింగంపర్తిలో అరటితోటలు పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారులు

ఏలేశ్వరం: మిచాంగ్ తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు దెబ్బతిన్న వరిపొలాలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. గురువారం వాతావరణం కాస్త తెరిపివ్వడంతో తడిసి ముద్దయిన వరి పనలను రైతులు ఆరబెట్టారు. కళ్లాల్లో ధ్యానం కుప్పలను వేరు చేసి గాలి తగిలేలా ఆరబెడుతున్నారు. మండలంలోని లింగంపర్తి, యర్రవరం, తిరుమాలి, సిరిపురం గ్రామాల్లో తడిసిన ధ్యానాన్ని అధికారులు కొనుగోలు చేశారు. ఇప్పటివరకూ సుమారు 70 టన్నుల ధ్యానాన్ని కొనుగోలు చేసినట్టు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులు నష్టపోకుండా తడిసిన ధ్యానాన్ని కొనుగోలు చేస్తున్నట్టు ఏఓ బి.జ్యోతి తెలిపారు. మండలంలోని లింగంపర్తి, పేరవరం తదితర గ్రామాల్లోని అరటి తోటలను ఉద్యానశాఖ అధికారి శ్రీవల్లి పరిశీలించి నష్టం అంచనా వేశారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



మండపంలో చిన్నారులకు పౌష్టికాహారం అందజేస్తున్న సర్పంచ్ మాణిక్యం, సీడీపీఓ పద్మావతి

శంఖవరం: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి అన్నారు. మండలంలోని మండపం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు గురువారం అదనపు అనుబంధ పోషకాహారం పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ కూనిశెట్టి మాణిక్యం ముఖ్య అతిథిగా పాల్గొన్ని చిన్నారులకు పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ పద్మావతి మాట్లాడుతూ బలహీనంగా ఉన్న చిన్నారులకు సెక్యూరిటీ ప్రింటింగ్ అండ్ మిటింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో అదనపు పోషకాహారం అందిస్తున్నామన్నారు. స్థానిక ఐసీడీఎస్ పరిధిలో 195 మంది చిన్నారులు బలహీనంగా ఉన్నట్లు గుర్తించామన్నారు. వీరందరికీ అదనపు పోషకాహారం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అరుణశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఈబీ దాడుల్లో నలుగురి అరెస్టు

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) పరిధిలో గురువారం నిర్వహించిన దాడుల్లో 30 లీటర్ల సారాతో నలుగురు నిందితులను అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్‌ఈబీ సీఐ పి.అశోక్ తెలిపారు. ప్రత్తిపాడు మండలం బవురువాక గిరిజన తండాలో సారా బట్టీలపై దాడి చేసి, సారా తయారీకి సిద్ధం చేసిన 100 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. సంఘటన స్థలం నుంచి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, మోసరి సత్తిబాబుపై కేసు నమోదు చేశారు. ఒమ్మంగిలో ఐదు లీటర్ల సారాతో మొగిలి ధర్మరాజును, కిర్లంపూడి మండలం తామరాడలో పది లీటర్ల సారాతో గుత్తుర్తి వీర వెంకట సత్యనారాయణను, గోనేడలో పది లీటర్ల సారాతో తాతపూడి నాగేశ్వరరావులను అరెస్టు చేశామని వివరించారు. నిందితులపై బైండోవర్ కేసులు నమోదు చేసి, ప్రత్తిపాడు, కిర్లంపూడి తహసీల్దార్ల వద్ద హాజరు పరిచారు. ఎస్‌ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత శిక్షణ

ఏలేశ్వరం: మండలంలో కొత్త యర్రవరంలో మహిళలకు గురువారం మగ్గంపై (నేత పని) ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దివాన్ చెరువుకు చెందిన వినయ్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు 70 మంది మహిళలకు శిక్షణ ఇచ్చారు. అనంతరం మహిళలకు మగ్గం మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో సుంకర వీరాస్వామి, మైరాల నాగేశ్వరరావు, చిదంబర్, పెదకాపు తదితరులు పాల్గొన్నారు.

రైతులను తక్షణమే ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణ

ప్రత్తిపాడు: మిచాంగ్ తుపాన్ కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యల్లపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ప్రత్తిపాడు మునసబు గారి రామాలయం ఆవరణలో గురువారం సాయంత్రం బీకేఎస్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ తుపాన్ కారణంగా ప్రత్తిపాడు మండలంలో పూర్తిగానూ, ఇతర మండలాల్లో కొంత మేర పంటలు దెబ్బతిన్నాయన్నారు. అధికారులు పూర్తి స్థాయిలో పరిశీలన చేసి, రైతులకు ఎకరాకు రూ.20 వేల చొప్పున నష్ట పరిహారం అందించాలని కోరారు. బీకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాసంశెట్టి రాజా మాట్లాడుతూ ఎకరాకు రూ.30 వరకు పెట్టుబడి పెట్టిన రైతాంగాన్ని తుపాన్ దెబ్బతీసిందన్నారు. కొన్ని చోట్ల వరి పనలు కుళ్లిపోతుండగా, మరికొన్ని చోట్ల మొలకలు వస్తున్నాయన్నారు. వర్షాలకు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. సమావేశంలో జిల్లా కమిటీ న్యాయ సలహాదారు ఆకుల హరిబాబు, బీకేఎస్ మండల ఉపాధ్యక్షుడు శింగిలిదేవి అప్పారావు, జిల్లా కమిటీ సభ్యుడు భేరి రాము తదితరులు పాల్గొన్నారు.

వరద నీరు ఫుల్.. రాకపోకలు నిల్

- వరద నీటితో హైవేపై రాకపోకలకు అంతరాయం
- పంపాకు వరద ఉధృతి తగ్గడంతో అనుమతి
- ప్రస్తుతం స్థిరంగా పంపా నీటిమట్టం



అన్నవరం జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న నీరు



నమూనా ఆలయం చుట్టూ చేరిన నీరు

అన్నవరం: మిచాంగ్ తుపాను ప్రభావంతో నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురియడంతో పంపా నదికి వరదనీరు పోటెత్తింది. అదనపు జలాలను బ్యారేజీ గేట్లు ఎత్తి సముద్రంలోకి విడుదల చేయడంతో ఆ నీరు స్థానిక డిగ్రీ కళాశాల వద్ద జాతీయ రహదారిని ముంచెత్తింది. దీంతో బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం మధ్యాహ్నం వరకూ వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో వాహనాల రాకపోకలను అన్నవరం మెయిన్ రోడ్ మీదుగా మళ్లించారు. గురువారం మధ్యాహ్నం వరకు జాతీయ రహదారిపై వాహనాలను అనుమతించ లేదు. పంపాకు నీటి ఉధృతి తగ్గుముఖం పట్టడంతో మళ్లీ వాహనాలను అనుమతించారు. నీటి ఉధృతి తగ్గడంతో పంపా రిజర్వాయర్ గేట్లు దించి 400 క్యూసెక్కుల నీటిని మాత్రమే సముద్రంలోకి విడుదల చేస్తున్నామని అధికారులు తెలిపారు. గురువారం సాయంత్రానికి పంపా నీటి మట్టం 102.8 అడుగులకు చేరింది. ఇన్‌ఫ్లోస్ 400 క్యూసెక్కులు ఉండగా ఔట్‌ఫ్లోస్ 400 క్యూసెక్కులు ఉంది.

నమూనా ఆలయం చుట్టూ చేరిన వరద

జాతీయ రహదారిపై ప్రవహించిన వరద నీరు అక్కడకు సమీపంలో నిర్మిస్తున్న సత్యదేవుని నమూనా ఆలయం చుట్టూ చేరింది. జాతీయ రహదారికి రెండు అడుగుల ఎత్తున నిర్మిస్తున్న ఈ నమూనా ఆలయం ముందు భాగంలో ఇంకా మెరక చేయలేదు. మెరక చేస్తే వరద నీరు వచ్చే అవకాశం లేదని దేవస్థానం అధికారులు తెలిపారు. నమూనా ఆలయం నిర్మాణానికి మెటీరియల్స్ తెచ్చుకునేందుకు వీలుగా దీనిని మెరక చేయలేదన్నారు. త్వరలో మెరక చేస్తామని వివరించారు. కాగా అన్నవరం ఎం ట్రాన్స్‌లో బెండపూడి వైపు వై జంక్షన్ వద్ద నీరు రోడ్డుపై ప్రవహించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. బెండపూడిలోని కాగితాలమ్మ చెరువు నుంచి నీరు అన్నవరంలోని రిజర్వ్ చెరువుకు వెళ్లే కాలువను మూసివేయడంతో నీరు రోడ్డుపై ప్రవహిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. సత్యదేవుని నమూనా ఆలయం వెనుక గల దేవస్థానం స్థలంలో నాటిన మారేడు మొక్కలు నీట మునిగాయి. వీటి సంరక్షణకు అధికారులు చర్యలు చేపట్టారు.